



# విజయభాను

46 Years of Excellence
విజయభాను వార్షికోత్సవ శుభాకాంక్షలు

విశాఖపట్నం, శనివారం 17-06-2023 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 229 పేజీలు : 08 వెల : 1 రూపాయి


### ప్రతి పేద కుటుంబం కూడా బాగుపడాలనే బాధ్యతతో

# అడుగులు వేస్తున్నాం

- రాష్ట్ర సర్కార్ నిర్మిస్తుంది జగనన్న కాలనీలు కాదు.. ఊర్లు
- దేవుడు నాకిచ్చిన అవకాశం

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**



కృష్ణా, (విజయభాను న్యూస్) : రాష్ట్ర సర్కార్ నిర్మిస్తోంది జగనన్న కాలనీలు కాదని.. ఏకంగా ఊర్లు కడుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. గుడివాడలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన లబ్ధిదారులు, ఏపీ ప్రజానికాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అధికారంలోకి వస్తే ఉచితంగా టిక్కడో ఇళ్లు కట్టిస్తామన్న హామీని నెరవేర్చాం. ప్రతీ లబ్ధిదారునికి రూ. 7 లక్షల ఆస్తిని ఉచితంగా ఇచ్చాం. అక్కచెల్లెమ్మల చేతిలో రూ. 6 నుంచి 15 లక్షల దాకా ఆస్తి పెట్టాం. పేదలకు 300 అడుగుల టిడ్కో ఇళ్లు ఉచితంగా లబ్ధిదారులకు ఒక్క రూపాయితో ఇస్తామని చెప్పాం. లేవుట్ 257 ఎకరాల స్థలం సేకరించి ఒక పక్కన టిడ్కో ఇళ్లు, మరోపక్క ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణం చేస్తున్నాం. వీటన్నింటి మధ్య ఈరోజు కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. గుడివాడలో మొత్తంగా 13,145 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చాం. 8,912 టిడ్కో ఇళ్లతో కలిపి 16,240 ఇళ్లు, కుటుంబాలు నివాసం ఉండబోతున్నాయి. 16,240 కుటుంబాలు.. ఇంటికి కనీసం ముగ్గురు వేసుకున్నా 40 వేల పైచిలుకు తరువాయి 2లో..



## అమెరికా, ఈజిప్టు దేశాల్లో మోడీ పర్యటన



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ జూన్ 20–25 వరకు అమెరికా, ఈజిప్టు దేశాల్లో అధికారిక పర్యటన చేయనున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్ ఆహ్వానం మేరకు మోడీ అమెరికా పర్యటించ నున్నారు. ఈ పర్యటన న్యూయార్క్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ పర్యటనలో భాగంగా జూన్ 21న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో మోడీ పాల్గొననున్నారు. జూన్ 22న వాషింగ్టన్ డి.సికి వెళ్లనున్నారు. అక్కడ వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు బైడెన్ ఆయనకు లాంఛనంగా స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సమావేశంలో ఇరువురు నేతలు చర్చలు జరుపుతారు. ఇక అదేరోజు సాయంత్రం మోడీ గౌరవర్థం అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ దంపతులు స్టేట్ డిన్నర్‌ను ఏర్పాటు చేయనున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఇఎ) విడుదల చేసిన ఒక ప్రకటన వెల్లడించింది. ఈ సందర్భంగా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్ కెవిన్ మెక్‌కార్తీ మరియు సెనేట్ స్పీకర్ చార్లెస్ షుమెర్‌తో సహా అమెరికా కాంగ్రెస్ నాయకుల ఆహ్వానం మేరకు పిఎం మోడీ జూన్ 22వ తేదీన యుఎస్ కాంగ్రెస్ ప్రతినిధుల సభలో ప్రసంగించనున్నారు. జూన్ 23వ తేదీ అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, స్టేట్ సెక్రటరీ ఆంటోనీ బిల్న్‌కెన్‌లు సంయుక్తంగా మధ్యాహ్నం విందు ఇవ్వనున్నారు. ఈ పర్యటనలో మోడీ ప్రముఖ సిఇఓలు, నిపుణులు, అనేకమంది అధికారులను ఆయన కలవనున్నారు. అలాగే ప్రవాస భారతీయులను కూడా ఆయన కలుస్తారు. కాగా, జూన్ 24–25 తేదీల్లో ఈజిప్టు అధికారిక పర్యటనకు వెళ్లనున్నారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎల్–సిసి ఆహ్వానం మేరకు మోడీ ఈజిప్టుకు వెళ్లనున్నారు. అబ్దెల్ ఫట్టా ఈ ఏడాది జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే మోడీ ఈజిప్టుకు వెళ్లడం ఇదే తొలిసారి.

## జూన్ 20న సికింద్రాబాద్ జగన్నాథ రథయాత్ర



హైదరాబాద్ (విజయభాను న్యూస్) : ఈ నెల 20వ తేదీన సికింద్రాబాద్‌లో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీ జగన్నాథ స్వామి రామ్‌గోపాల్ ట్రస్ట్ ప్రకటించింది. జగన్నాథుడు, భలభద్రుడు, సుభద్రల విగ్రహాలను ఊరేగించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ ఆలయంలో 130 ఏండ్ల నుంచి ఈ రథయాత్రను నిర్వహిస్తున్నారు. 20వ తేదీన ఉదయం 6:15 గంటల నుంచి తరువాయి 2లో..

## రాబోయేది తెదేపా ప్రభుత్వం..

**కాబోయే సీఎం చంద్రబాబు : ఆనం రామనారాయణరెడ్డి**



నెల్లూరు, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో రాబోయేది తెదేపా ప్రభుత్వమే అని, సీఎం కాబోయేది చంద్రబాబు అని నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని యువతకు భవిష్యత్తును ఇచ్చేది నారా లోకేశ్ అని చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నెల్లూరులోని అనంతసాగరంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నారా లోకేశ్ ప్రజల ఆశీస్సులతో 1,600 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్నారని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆత్మకూరులో తట్టెడు మట్టి వేయలేదని ఆరోపించారు. ఇక్కడి ప్రజలకు ఇసుక తరువాయి 2లో..

### రౌడీషీటర్లు లేకుండా

## విశాఖ ప్రశాంతంగా ఉంది

**: డీజీపీ రాజేంద్రనాథ్**



మంగళగిరి, (విజయభాను న్యూస్) : విశాఖలో కిడ్నాప్ ఘటనపై డీజీపీ రాజేంద్రనాథ్ వివరణ ఇచ్చారు. డబ్బు కోసమే కిడ్నాప్ చేశారని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగానే ఉన్నాయని వెల్లడించారు. రౌడీషీటర్లు లేకుండా విశాఖ ప్రశాంతంగా ఉంది. ఏపీ క్రైమ్‌రేట్ తగ్గిందని స్పష్టం చేశారు. కాగా, డీజీపీ రాజేంద్రనాథ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కిడ్నాప్ విషయం విశాఖ ఎంపీ ఫోన్ చేసి అక్కడి సీపీకి సమాచారం ఇచ్చారు. ఆడిటర్, ఎంపీ భార్య, కుమారుడిని కిడ్నాప్ చేసినట్టు సమాచారం వచ్చింది. రిషికొండలో బాధితులు ఉన్నట్టు ట్రేస్ చేశాం. పోలీసులకు సమాచారం వచ్చినట్టు నిందితులకు తెలిసింది. ఎంపీ కొడుకు, భార్య, మరో వ్యక్తిని తీసుకుని మళ్లీ పారిపోయేందుకు నిందితులు ప్రయత్నించారు. పద్మనాభపురం వరకూ వెళ్లి అక్కడ బాధితులను వదిలి పారిపోయారు. డబ్బు కోసమే ముందుగా ఎంపీ కుమారుడిని కిడ్నాప్ చేశారు. కుమారుడితో ఫోన్ చేయించి తల్లిని రప్పించారు. గంటల వ్యవధితోనే కిడ్నాపర్లను పట్టుకున్నాం. కిడ్నాపర్లు రూ.కోటి 75లక్షలు తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ.85లక్షలు రికవరీ చేశాం. కత్తితో చంపేస్తామని కిడ్నాపర్లు బెదిరించారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. ఇవాళ నిందితులను కోర్టులో హాజరు పరుస్తాం. రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరిగిందనడం సరికాదు. రాష్ట్రంలో? తరువాయి 2లో..

## ఒకే మిషన్‌లో 41 శాటిలైట్స్.. చైనా రికార్డు



బీజింగ్ : లాంగ్ మార్చ్ 2డీ రాకెట్‌ను చైనా ప్రయోగించింది. ఆ రాకెట్ ద్వారా 41 ఉపగ్రహాలను పంపింది. ఒకే మిషన్‌లో అన్ని శాటిలైట్లను పంపడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. దీంతో చైనా సరికొత్త రికార్డును సృష్టించిందని జిన్హువా మీడియా తెలిపింది. షాంగ్జి ప్రావిన్సులో ఉన్న తైయువన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుండి తరువాయి 2లో..






# 23వ తేది నుంచి "జగనన్న సురక్ష"

**ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి -వీడియో కాన్ఫరెన్సులో పేర్కొన్న జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యతనిచ్చే రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు సరికొత్త కార్యక్రమం "జగనన్న సురక్ష" కు శ్రీకారం చుట్టనుందని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల






తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, జోనల్ కమీషనర్లతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా తరువాయి 2లో..

# నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉంటే భారీ స్థాయిలో అపరాధ రుసుం

## దుకాణదారులను హెచ్చరించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లో భాగంగా విశాఖ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ను విక్రయించిన, వినియోగించిన భారీ స్థాయిలో అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ హెచ్చరించారు. నగరంలో ప్లాస్టిక్ నిర్మూలన కొరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి దుకాణాలను తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నగరంలో ఉన్నతాధికారులతో కూడిన స్పెషల్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసి 6819 దుకాణాల నుండి సుమారు 1000 కేజీల నిషేధిత ప్లాస్టిక్ తో పాటు ఆరు లక్షల రూపాయలు అపరాధ రుసుం వసూలు చేయడం జరిగిందని తెలిపారు. నగరంలోని వ్యాపారస్తులు, వినియోగదారులు నిషేధిత ప్లాస్టిక్ ను వాడరాదని, ప్రత్యామ్నాయ వస్తువులైన క్లాత్, నారా, కాగితపు సంచులను ఉపయోగించాలని కూడా ఈ ప్రత్యేక బృందాల ద్వారా దుకాణదారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించడం జరిగినది అని తెలిపారు.

## “టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం” లో 03 పిర్యాదులు...





విశాఖపట్నం, విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** జివిఎంసి పరిధిలో ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో పిర్యాదులు అధికంగా వస్తున్న నేపద్యంలో జివిఎంసి కమీషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ టౌన్ ప్లానింగ్ పిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా “టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం” కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా అధికంగా పట్టణ ప్రణాళిక విభాగపు ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఆధ్వర్యంలో “టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం” కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక అధికారి మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో రెండవ జోన్ కు (01), నాలుగవ జోన్ కు (01), 5వ జోన్ కు (01), ఫిర్యాదులు అందాయని తెలిపారు. అందిన ఫిర్యాదులను కమిషనర్ సూచనల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నటువంటి ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపై, టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎలాంటి పిర్యాదుల గురించి తెలియజేయాలన్నా, జివిఎంసిలో ఉన్న టోల్ ఫ్రీ ఫోన్ నంబర్: 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చు మరియు జివిఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన “వాట్స్యాప్ నంబర్: 81878 97569”కు వారి యొక్క మొబైల్ నుండి తమ పిర్యాదులను పూర్తి వివరములతో అనగా పేరు, డోర్ నెంబర్, వార్డ్ నెంబర్, చిరునామా మరియు సమస్య యొక్క వివరములను వాట్స్యాప్ పంపిన యెడల వాటిని సంబందిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, ఆ సమస్య పై సత్వర చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. పద్మజ, నరేంద్ర రెడ్డి, ఎ.సి.పి. లు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి డిజిటల్ ఈ స్టాంపులు : ఎస్.ఆర్.ఓ మోహనరావు



మధురవాడ (విజయభాను న్యూస్) : మధురవాడ ఎస్.ఆర్.ఓ పరిధిలో సిరిపురపు శ్రీహరి సి.ఎస్.సి మీసేవ సెంటర్ లో ఈ స్టాంప్ సర్వీస్ లు ప్రారంభించారు. మధురవాడ ఎస్.ఆర్ .ఓ మోహనరావుని శుక్రవారం శ్రీహరి కలిసి ఈ స్టాంప్ ఏ విధంగా వినియోగదారులకు అందచేస్తారో అనే వివరాలను వివరించారు. ఈ స్టాంప్ లు 50 రూపాయలనుండి వినియోగ దారులకు అవసరమైన ఎంత మొత్తంలోనైనా లభిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఈ సర్వీసులను వాంబేకాలనీ సి.ఎస్.సి (మీసేవ) సెంటర్ లో లభిస్తాయని త్వరలో రిజిస్టర్ కార్యాలయం పరిసరాల కు దగ్గరలో ప్రారంభిస్తామని రిజిస్టర్ అధికారి మోహనరావు కి తెలియచేసారు. ఎస్.ఆర్.ఓ రిజిస్ట్రర్ అధికారి మోహన్ రావు, వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగం లో ఉన్న స్టాంప్ లు ఉన్నంతవరకు ఉపయోగించుకుని ఇక అందుబాటులోకి డిజిటల్ ఇండియా లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ స్టాంపు లను ప్రారంభించారని పూర్తిగా ఈ స్టాంపులను వినియోగించుకోవాలని తెలిపారు మధురవాడ ఎస్ ఆర్ ఓ పరిధిలో స్టాంప్ వినియోగదారులు ఈ స్టాంపులను శ్రీహరి సి.ఎస్.సి మీసేవ సెంటర్ వాంబే కాలనీలో లభిస్తాయని ఈ స్టాంప్ లు అన్నివిధాలా రిజిస్ట్రేషన్ మరియు నాన్ రిజిస్ట్రేషన్ సర్వీసులకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఓ అధికారులు మోహనరావు, వెంకయ్యనాయుడు, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, సి.ఎస్.సి మీసేవ సెంటర్ ఆపరేటర్ శ్రీహరి పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో వికసించిన విద్యాకుసుమం




పరవాడ, (విజయభాను న్యూస్) : కృషి,పట్టుదల,సాధించాలనే తపన ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించాడు అనకాపల్లిజిల్లా మండల కేంద్రం పరవాడ కు చెందిన విద్యా కుసుమం కూండ్రపు వసంత్.మంగళవారం విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో వసంత్ జాతీయస్థాయి ఓపెన్ కేటగిరీలో 1199 వ ర్యాంకు,ర్యాంకు,ఓబిసి కేటగిరీలో 303 వ ర్యాంకు,ఎంసెట్ అగ్రికల్చర్ విభాగంలో 139 వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు.ఈ మేరకు విజయవాడలో కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వసంత్ ను ఘనంగా సత్కరించి లక్ష రూపాయలు నగదు బహుమతిని అందజేసారు.

వసంత్ తండ్రి కూండ్రపు అప్పలనాయుడు (బుజ్జి) ఎన్టీపీసి లో మెయింట్ నెన్స్ కార్మికుడు గాను,తల్లి లక్ష్మి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ పద్దతిలో క్రాఫ్ట్ ఇన్ స్ట్రక్టర్ గా పనిచేస్తున్నారు. వసంత్ అన్నయ్య చైతన్య గుజరాత్ లోని రిలయన్స్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్ గా ఉద్యోగ భాధ్యతలు నిర్వహిస్తు న్నాడు.

ప్రణాళికా బద్ధంగా చదివి ఇంతటి మంచి ర్యాంకు సాధించానని, తల్లితండ్రులు, సోదరుడు, కళాశాల యాజ మాన్యం అందించిన ప్రోత్సాహం మరువ లేనిదని, భవిష్యత్తులో డాక్టర్ గా స్థిరపడాలనేది తన ఆకాంక్ష అని వసంత్ తెలిపాడు.

# రాష్ట్ర అభివృద్ధిలో జగనే టాప్ - అవంతి



మధురవాడ (విజయభాను న్యూస్) : మహావిశాఖ జోన్ 2 పరిధి 7 వార్డు పరిధిలో రూ.78 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 7వ వార్డు టిడిపి కార్పొరేటర్ పిల్లా మంగమ్మ పాల్గొని శుక్రవారం శంకుస్థాపన చేశారు. 7వ వార్డు పరిధి చంద్రం పాలెం, పాత పి ఎం పాలెం, కళా నగర్, కాలనీల్లో రోడ్లు, సిసి డ్రెయిన్ల అభివృద్ధి పనులకు అదే విధంగా వాంబే కాలనీ, దుర్గా నగర్ కాలనీ లో పార్క్ లు అభివృద్ధి పనులు కు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అనంతరం 7వ వార్డు పిలకవాని పాలెం సమీపంలో వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతు ఇటువంటి మంచి పనులకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. వార్డు అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. వైఎస్సార్సీపీ కి ప్రజా బలం ఎక్కువ ప్రతి పక్షాలకు మీడియా బలం ఎక్కువ అని ఏద్దేవ చేశారు. రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందనీ, ఇటువంటి అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించవా అంటూ ప్రశ్నించారు. విశాఖ ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారన్నారు. ఒకప్పుడు మధురవాడ ఇప్పుడు మధురమైన వాడ గా తయారైంది అని పేర్కొన్నారు. అనంతరం బక్కన్నపలెం ప్రాంతానికి చెందిన కె. కుమారి అనే దివ్యంగురాలికి ద్విచక్ర వాహనాన్ని అవంతి శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. స్థానిక ప్రజలను సమస్యలు అలాగే సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి ముత్తంశెట్టి మహేష్, జోన్ 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, వర్క్స్ ఏ ఈ వెంకటరావు, వాటర్ ఏ ఈ శ్రీహరి, 7వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాస్, 7వ వార్డు టిడిపి సీనియర్ నాయకులు పిల్లా వెంకట రావు, వంకాయల మారుతి ప్రసాద్, కృష్ణ మూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, చేకూరి రజిని, యువ నాయకుడు జగుపిళ్ళ నరేష్, మొజ్జాడ రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## 23వ తేది నుంచి “జగనన్న సురక్ష”

ఈ నెల 23వ తేదీ నుంచి జులై 23 వరకు జగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓ, తహశీల్దార్ ఒక బృందం గా ఏర్పడి

గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, జోనల్ కమీషనర్లు ఒక బృందం గా ఏర్పడి వార్డుల్లో పర్యటించాలని, బృందం సందర్శించే గ్రామాన్ని ముందుగానే గ్రామస్తులకు తెలిపి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి ఆ ఇంటికి సంబంధించి జనన, మరణ , కుల, వివాహ దృవపత్రాలు నుంచి ప్రభుత్వ పథకాలను పొందడం దాకా ఏమైనా సమస్యలున్నాయా అని నిశితంగా పరిశీలించి , ఆ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నిర్దేశిత తేదిల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శించి అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందజేయాలన్నారు. ప్రతి రోజు ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయాల పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి ఆగష్టు 1వ తేదిన లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. రేపటి నుంచి సచివాలయాల సిబ్బందికి ఈ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జివియంసి కమీషనర్ సియం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీఓలు బాస్కరరావు, హుస్సేన్ సాహెబ్, డిఎల్ డీఓ పూర్ణిమా దేవి, జోనల్ కమీషనర్లు, తహసీల్దార్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి పేద కుటుంబం కూడా బాగుపడాలనే బాధ్యతతో

# అడుగులు వేస్తున్నాం

జనాభా ఇక్కడే కాలనీలో నివాసం ఉండబోతోంది. రూ. 800 కోట్ల రూపాయలతో 8,912 ఇళ్లు ఈరోజు కట్టడమే కాకుండా కట్టిన ఇళ్లను నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం జరుగుతోంది. 178 ఎకరాల్లో 7,728 ఇళ్ల స్థలాలను, ఇళ్లులేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇళ్లస్థలాలు కూడా ఇచ్చాం. ప్రతి లబ్ధిదారుకి 1.1 సెంటు ఇచ్చాం. 7 లక్షల రూపాయలు అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టడం జరిగింది. జూలై 8వ తేదీన 8,859 ఇళ్ల పట్టాలకు అదనంగా మరో 4,200 ఇళ్లు కూడా మంజూరు చేస్తున్నాం. ప్రతి పేద కుటుంబం కూడా బాగుపడాలనే బాధ్యతతో అడుగులు వేస్తున్నాం. ఇదే గుడివాడకు ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచిన అల్లుడు ఉన్నాడు. తన 14 ఏళ్ల పాలనలో ఇక్కడి పేదలకు కనీసం ఒక్కరికంటే ఒక్కరికి కూడా ఇళ్ల పట్టాలిచ్చిన దాఖలాలు లేవు. ఒక్క పేదవాడికి కూడా ఒక సెంటు ఇచ్చిన దాఖలాలు లేవు. బాబు పాలనకు భిన్నంగా పేదల ప్రభుత్వంగా ఈ ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నాం. అక్కచెల్లెమ్మల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 30,60,000 ఇళ్లపట్టాలివ్వడం జరిగింది. ఇప్పటికే 21 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. మనం నిర్మిస్తున్న జగనన్న కాలనీలు 17,000.. ఇప్పటికే పూర్తయిన ఇళ్లు 5,52,000. అక్కచెల్లెమ్మల పేరుతో ఇచ్చిన ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఉంటుంది. మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల విలువ 30,60,000 ఇళ్ల పట్టాల మీద 75,000 కోట్ల రూపాయల ఆస్తులు అక్కచెల్లెమ్మలకు అందజేస్తున్నాం. ఒక్కో ఇంటిని 2.70 లక్షలతో ఇంటిని కడుతున్నాం. డ్రెయిన్లు, రోడ్లు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్కు లక్ష ఖర్చు.స్థలం విలువ 6 లక్షల నుంచి 10 లక్షలు, 15 లక్షల దాకా కూడా పోతుందని చెప్పడానికి గర్వ పడుతున్నా. ఇళ్ల మహాయజ్ఞం ద్వారా 2 - 3 లక్షల కోట్ల ఆస్తిని ప్రతి అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం. దేవుడు నాకిచ్చిన అవకాశానికి ఇంతకన్నా సంతోషం ఉంటుందా. కొంత మందికి ఈర్ష్య ద్వేషం ఎక్కువయ్యాయి. నిరుపేదలకు నివాసం ఉండే 300 చ.అ. ఫ్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు 2వేలు. ఒక్కో ఫ్లాట్ కు దాదాపు 5.75 లక్షలు కట్టడానికి, మౌలిక సదుపాయాలకు మరో లక్ష. 300 అడుగులు 6.75 లక్షలు ఖర్చయ్యే ఫ్లాట్ కు కేంద్రం 1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం 1.5 లక్ష ఇస్తోంది. మిగిలిన 3 లక్షల రూపాయలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా 3 వేలు 20 ఏళ్లపాటు పేదవాడు కడుతూ పోవాలి. పేదవాడు 300 అడుగుల ఇంటిని సొంతం చేసుకొనేందుకు 7.20 లక్షలు జేబు నుంచి కట్టాలి. అది చంద్రబాబు హయాంలో తెచ్చిన టిడ్కో పథకం. చంద్రబాబు హయాంలో.. నేల మీద ఇళ్లు లేవు, పట్టాలేదు, ఉచితంగా ఇచ్చింది అంతకన్నా లేదు. కానీ మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చ.అ.లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లు 1,43,600 ఇళ్లు. అన్ని హక్కులతో ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాం. వీటి విలువ 6.75 లక్షలు. వీటిని ఒక్క రూపాయికే ఇస్తున్నాం.

365 చదరపు అడుగలకి సంబంధించి గతంలో ఇదే మాదిరిగా లెక్కలు కట్టారు. రాష్ట్రం, కేంద్రం ఇస్తున్న 3 లక్షల సబ్సిడీకి అదనంగా 365 చ.అ. వాటికి 50 వేలు కట్టించుకున్నారు. మీ బిడ్డ వచ్చిన తర్వాత 3 లక్షలు ఇవ్వడమే కాకుండా ఇన్ ఫ్రా స్ట్రక్చర్ కోసం లక్ష, మరో 25 వేలు కలిపి ప్రతి పేద వాడికి 4.25 లక్షలు సబ్సిడీ ఇస్తున్నాం. 430 చ.అ. తీసుకున్న ప్రతి పేద వాడికీ 3 లక్షలు కాకుండా, డిపాజిట్ లక్ష నుంచి 50 వేలకు తగ్గించాం. రూ. 4.50 లక్షల సబ్సిడీ ఇస్తున్నాం.

టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు ప్రభుత్వం 16,601 కోట్లు ఖర్చు భరిస్తోంది. ఇది వాస్తవం. అయితే, ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి అని అడుగుతున్నా. గుమాస్తాగిరీ పని కూడా సరిగ్గా చేయలేదు. తాను చేయని పనులు చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం తప్ప చేసిందేమిటి?. నాలుగేళ్లలో మనందరి ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది. ఆలోచన చేయాలి.మరి ఇదే పనిని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన ఈ బాబు ఎందుకు చేయలేకపోయాడు ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.బాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.

అమరావతిలో పేదలకు ఇళ్లపట్టాలిస్తే అక్కడ డెమోగ్రఫిక్ ఇంబ్యాలన్స్ వస్తుందని ఏకంగా కోర్టుల్లో కూడా నిస్సిగ్గుగా వాదించారు. అదే అమరావతిలో 50 వేల మంది అక్కచెల్లెమ్మలకు సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఇదే పనిని ఈ బాబు ఎందుకు చేయలేదని ఆలోచన చేయాలి. ఈ నాలుగేళ్లు సంవత్సరాల కాలంలో 2.16 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి లంచాలు లేకుండా, వివక్ష లేకుండా నేరుగా వెళ్తున్నాయి.

## రౌడీషీటర్లు లేకుండా విశాఖ ప్రశాంతంగా ఉంది

శాంతిభద్రతలు పటిష్టంగానే ఉన్నాయి. రౌడీషీటర్లు లేకుండా విశాఖ ప్రశాంతంగా ఉంది. పోలీసులు అలర్ట్గా ఉన్నారు కాబట్టే గంటల వ్యవధిలోనే కిడ్నాపర్లను పట్టుకోగలిగాం. భూ కబ్జాల కేసులు తక్కువ నమోదవుతున్నాయి. గంజాయి పంటలను రెండు సంవత్సరాల నుండి ధ్వంసం చేస్తున్నాం. గంజాయి అమ్మేవాళ్లపై పీడీ యాక్ట్లు పెడుతున్నాం. ఒరిస్సా నుండి గంజాయి వస్తోంది.. మన రాష్ట్రంలో గంజాయి సాగు లేదు. నిందితులకు వేగంగా శిక్షలు పడుతున్నాయి అని వెల్లడించారు.

## ఒకే మిషన్‌లో 41 శాటిలైట్స్.. చైనా రికార్డు

ఈ రాకెట్‌ను ప్రయోగించారు. లాంగ్ మార్చ్ రాకెట్ సిరీస్‌లో ఇది 476వ ఫ్లయిట్ మిషన్ కావడం విశేషం. ఇటీవల చంద్రునిపై వ్యోమగాములను ఉంచాలనే లక్ష్యంతో చైనా తన కక్ష్యలో ఉన్న అంతరిక్ష కేంద్రంలోకి ముగ్గురు వ్యక్తులను పంపిన సంగతి తెలిసిందే. చైనా ప్రయోగించిన శాటిలైట్లు.. కమర్షియల్ రిమోట్ సెన్సింగ్ సర్వీసులను కల్పించనున్నాయి. ఆ శాటిలైట్లలో 36 జిలిన్-1 సిరీస్‌కు చెందినవి. గురువారం నాటి ప్రయోగంతో ఇప్పటి వరకు చైనా మొత్తం 108 జిలిన్-1 శాలిలైట్లను ప్రయోగించినట్లు జిన్హువా తెలిపింది. దీంతో 100 కంటే అధిక రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలతో కూడిన మొదటి వాణిజ్య కూటమిగా చైనా అవతరించిందని వెల్లడించింది. జిలిన్-1 శాటిలైట్‌ను 2015లో చైనా ప్రయోగించింది. ఆ శాటిలైట్ బరువు సుమారు 420 కేజీలు ఉంటుంది. ప్రస్తుతం ఈ శాటిలైట్ల బరువు కేవలం 22 కిలోలు మాత్రమేనని తెలిపింది. 2030 నాటికి చంద్రునికి వెలుపల మరియు భూమిపై కార్యకలాపాలకు మధ్య కమ్యూనికేషన్ వంతెనగా పనిచేసే రిలే శాటిలైట్స్‌ను రూపొందించేందుకు చైనా కృషి చేస్తోంది.

## జూన్ 20న సికింద్రాబాద్ జగన్నాథ రథయాత్ర

మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జగన్నాథ రథయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. జనరల్ బజార్ నుంచి ఎంజీ రోడ్డు మీదుగా, రాణిగంజ్‌లోని హిల్ స్ట్రీట్ వరకు కొనసాగనుంది. రాత్రి 10:30 గంటలకు ఈ రథయాత్ర రాణిగంజ్ చేరుకుంటుంది. తిరిగి ఉదయం 4 గంటలకు జగన్నాథ ఆలయానికి రథయాత్ర చేరుకుంటుంది. రథయాత్ర నేపథ్యంలో భక్తులు ఉదయమే స్వామి వారిని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు సూచించారు.

## రాబోయేది తెదేపా ప్రభుత్వం..

దొరక్కుండా చేసి.. వైకాపా నేతలు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. సోమశిల ప్రాజెక్టు మరమ్మతుల కోసం వైకాపా ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. “నేను గెలిచిన 3నెలల్లోనే వైకాపా ప్రభుత్వం మాఫియా రాజ్యం అయిపోయిందని చెప్పాను. రైల్వే లైన్, ప్రభుత్వ ఆసుపత్రి అన్నీ వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. వైకాపాది విధ్వంసకర ప్రభుత్వం. కొత్తవి కట్టడం ఈ ప్రభుత్వానికి చేతకాదు. అందుకే ఇది సైకో ప్రభుత్వం. ప్రభుత్వ భవనాన్ని ప్రభుత్వమే కూల్చేసింది అంటే తన పతనాన్ని తానే కోరుకుంది. అందుకే సైకో పోవాలి.. సైకిల్ రావాలి. ఆత్మకూరును అభివృద్ధి చేయబోయేది తెదేపా. ఆత్మకూరుకి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలి” అని ఆనం కోరారు.

## పూర్వ ప్రాథమిక విద్యతో

# చిన్నారులకు మంచి భవిష్యత్తు

### అనంతగిరి ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ లక్ష్మి లావణ్య..



అనంతగిరి, విజయభాను న్యూస్ : అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య తొ చిన్నారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అనంతగిరి ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి లావణ్య, శాంతి ప్రియ, నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలో గల అనంతగిరి సెక్టార్ పరిధిలో జన భాగీ దారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు అనంతరం. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ ప్రైమరీ విద్యను గూర్చి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించారు. చిన్నారులకు భవిష్యత్తులో పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ఉపయోగపడుతుందని వారు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న పిపి1, పిపి 2, పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి సెక్టార్ కార్యకర్తలు కే లక్ష్మి, సుమిత్ర ,సరస్వతి, చిలకమ్మా,చిట్టెమ్మ ,కాంత తదితరులు పాల్గొన్నారు.

# నిరసన టెంట్ తగులబెట్టేశారు

### నిరసన తెలిపే హక్కు ను కాలరాస్తారా అంటూ దళితులు ఆగ్రహం

### మద్దతుగా నిలిచారు డివిఎంసి సభ్యులు ఎం.అప్పలరాజు



**నర్సీపట్నం, విజయభాను న్యూస్ :** నిరసన వ్యక్తం చేస్తున్న వారి టెంట్ ను తగులబెట్టేసారంటూ మాకవరం పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళితే గత కొంతకాలంగా జీ కోడూరు రెవెన్యూ పరిధి 332 సర్వేనెంబర్ కు ఆనుకొని ఉన్న దళితులు యొక్క డి పట్టా భూములపై తమ హక్కులు కాలరాయ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే కారుతో గుద్దించి చంపేస్తానంటూ.... మీ పట్టాలు రద్దు చేయిస్తానంటూ... తక్కువ జాతి వారులారా అంటూ బహిరంగంగా దూషించిన రాజాసాగి నాగ వెంకట సూర్య నారాయణ రాజే ఈ పని అంతా చేయించాడని అతిమూరి చినదేముడు, పెంటయ్య, అప్పారావు,కాతా మారేషు, తదితరులు అనుమానం వ్యక్తం చేశారు. మాకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంఘటన స్థలానికి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎమ్ అప్పలరాజు బాధితులతో కలిసి వెళ్లి సందర్శించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

# ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ కోసం సమావేశం



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : పద్మనాభం మండలంలో భీమిలి టి డి పి ఇంచార్జ్ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ కోసం పద్మనాభం మండల నాయకులు, పంచాయితీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇన్చార్జుతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరాడ రాజబాబు మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ హౌస్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, దొంగ ఓట్లను గుర్తించి ఎలక్షన్ కమీషన్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కశిరెడ్డి దామోదర రావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, జిల్లా కార్యదర్శి మజ్జి నందీశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.ఎ.ఎన్ మూర్తి, పద్మనాభం మండలం మహిళా అధ్యక్షురాలు బోదల పావని, పద్మనాభం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మీ నాయుడు, రామసింగి సన్యాసిరావు, పాండ్రంగి అప్పలనాయుడు, గెద్ద ప్రసాద్, గణేష్, బి.ఆర్ చింతపల్లి నారాయణ రావు, నియోజవర్గం ఐటీడీపీ అధ్యక్షులు మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్,సంగు శ్రీను, కోరాడ వెంకటరావు, కంటుబోతు సుమంత్ నాయుడు, ఓళ్ళ నందిని, ఐటిడిపి సభ్యులు ఓళ్ళ అప్పలనాయుడు, 41 బూత్ ఇంచార్జ పొన్నాడ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు భీమిలి లో పలు ప్రాంతాల్లో

# విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : 11కె.వి పాతపరదేసి పాలెం లైన్ లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించుట, ఇతర మరమ్మత్తుల నిమిత్తము శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు భీమిలి మండలం పాత పరదేసిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుందనీ భీమిలి ఎ.పి.ఈ.పి.డి.సి.ఎల్ ఎఈ యు.శంకరయ్య తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# మండల సమాఖ్యలో సమీక్ష



సమీక్షిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మండల సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం మండలంలో వీఓఏలు, సీసీలు, సీఎఫ్ లతో ఏసీ చిరంజీవి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్ పీఓ ఎస్ హెచ్ జీ సేవింగ్స్ , మెంబెర్స్ ఆన్లైన్ వర్క్, మహిళ మార్ట్ , స్త్రీనిధి డీసీబీ,న్యూ లోన్స్ రిక్వెస్ట్, పీఓపీ ఉన్నతి లోన్సు , .సీడికాపీటల్ లోన్స్ పై సమీక్షించి వివరాలు సేకరించారు. ఏపీఓలు దధికుమార్, అప్పలనాయుడు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న హోంమంత్రి తానేటి వనిత



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి తానేటి.వనిత శుక్రవారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ చైర్మెన్ ఐ.వి.రోహిత్,ఆలయ కార్య నిర్వహణాధికారి ఆజాద్,ఆలయ పిఆర్వో దామెర.కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా చైర్మెన్ ఐ.వి.రోహిత్ శ్రీ స్వామివారి ప్రసాదమును, శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్పీ లలితా కుమారి,ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు,స్థానిక అడిషనల్ ఎస్సై అజయ్ బాబు,ఆర్ఐ భాస్కర ప్రసాద్,పిఆర్వో విభాగం అధికారి పోల్నాటి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అడిగితే కాని జీతం ఇవ్వరా..? మేము ఏమితిని బ్రతకాలి

### మా పంచాయతీకి డి.డి.ఓ ఎవరు..!
### భీంపోలు పంచాయతీ గ్రామ వాలెంటీర్లు.!



అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి, రాష్ట్ర ముఖ్య మంత్రి. నా పార్టీ కి వెన్ను ముక అంటూ, మిరే రథ సారదు లు అంటున్నా రాష్ట్ర ముఖ్య మంత్రి,ప్రతి సచివాలయం పరిధిలో వెట్టి చాకరి చేయించుకుంటు,నెల అయ్యే సరికి జీతాలు ఇవ్వడం లేదు అంటూ నినాదాలు చేస్తున్నా, మండలంలో భీం పోలు పంచాయతీ సచివాలయం వాలెంటీర్లు. వాలంటీర్ దాస్ మాట్లాడుతూ,మాకు జీతాలు 1,2, వ తేదీల లో వేయాల ని ప్రభుత్వం నుంచి రూల్ ఉంది, కాని మేము మాకు జీతాలు వేయండ ని ఆడుక్కు నే వరకు జీతాలు రావడం లేదు,పని చేయించు కుంటూ మాకు జీతాలు విషయం లో ఇబ్బంది పెడుతున్నారు,ఇచ్చేది ఐదు వేల రూపాయలు ప్రతి నెల అడుక్కునే పరిస్థితి వస్తుంది,ఉగాది పురస్కారాలు కింద మాకు సేవా రత్న,సేవా వజ్ర,సేవా మిత్ర, అవార్డు లు కి మాకు అర్హత లేదా,ప్రజలు కోసం కష్ట పడి పని చేస్తున్నాం అధికారులు చేయవలిసిన పనులు కూడా మాతో చేయించు కుంటారు, పంచాయతీ ఆఫీస్ లో సమావేశలు జరిగే టప్పుడు, మా వాలెంటీర్స్ కి రాజకీయ నాయకులు, అధికారులు పొగడ్తలు తో, చప్పట్లు తో సరి పెడుతున్నారు, తప్పా మా శ్రమని గుర్తించే నాయకులు, అధికారులు లేరు,పంచాయతీ లో డి.డి.ఓ ఎవరు అనేది తెలియడం లేదు, అధికారులు నాయకులు డి.డి.ఓ ని ఎందుకు పరిమెనెంట్ గా ఉండే వారిని వేయడం లేదు, మాగోడు మండలం అధికారులకు పట్టదా జీతాలు ప్రతి నెల అనుకున్న తేది ల లో ఇచ్చే విదంగా చూడాలి లేని యడల జిల్లా కార్యాలయంలో ధర్నా చేయుటకు సిద్ధంగా ఉన్నామ ని భీం పోలు పంచాయతీ వాలెంటీర్లు హెచ్చరించారు,

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన

# మిత్రుడు కోసం క్రికెట్ టోర్నమెంట్



టోర్నీ కప్ ను ప్రధానం చేస్తున్న దృశ్యం.

రాజాం (విజయభాను న్యూస్): రాజాం మండలం గురవా%శీ% లో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆల్తి లక్ష్మణరావు జ్ఞాపకార్థం గురవా%శీ% గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ అతని స్నేహితులు శుక్రవారం నిర్వహించారు. లక్ష్మణ్ కు క్రికెట్ అంటే ఇష్టమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ టోర్నమెంట్ నిర్వహించామని యువకులు తెలిపారు. గత రెండు రోజులుగా మ్యాచ్ లు నిర్వహిస్తున్నామని శుక్రవారం ఫైనల్ మ్యాచ్ లో లచ్చన్నవలస, గురు వారం గ్రామాల మధ్య జరిగిన మ్యాచ్ లో గురవా టీం గెలుపొందిందని వెల్లడించారు.

గెలిచిన కప్ ను లక్ష్మణ్ కు అంకితమిస్తున్నామని గెలుపొందిన టీమ్ సభ్యులు వెల్లడించారు.

## గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక సేవలు

### - కలెక్టర్ డా.కృతికా శుక్లా

కాకినాడ, విజయభాను న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష కార్యక్రమం కింద ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో రీసర్వే పూర్తయిన 11 మండలాల్లోని 121 గ్రామాలకు సంబంధించి భూయజమానులు, పట్టాదారులు, రైతులకు వివిధ సేవలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ డా. కృతికా శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ పార్సిల్ నంబర్ ఆధారంగా పట్టాదారు ఆధార్ సీడింగ్, మ్యుటేషన్ బై కరెక్షన్, ఆటోమేటిక్ పట్టాదార్ పాస్‌బుక్ ఆర్డరింగ్, సబ్ డివిజన్, ల్యాండ్ కన్వర్షన్ సర్వీసులు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. భూ యజమానులు/రైతులు తమకు కావాల్సిన సర్వీసు కోసం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఏపీసేవా పోర్టల్‌లో తగిన రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

## కళా ప్రాంగణానికి శంకుస్థాపన



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో వరలక్ష్మి సెయింటాన్స్ స్కూల్ వెనుకబాగంలో శుక్రవారం రాజాం పట్టణ కళాకారులు నిమిత్తం కళా ప్రాంగణం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. వైఎస్ఆర్సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావుతో పాటు పద్మశ్రీ యడ్ల గోపాలరావు తదితరులు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా పాలవలస శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స నిధులును విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంజూరీచేశారని అన్నారు. జీఎంఆర్ వీఎఫ్ స్థలాన్ని ఉచితంగా ఇచ్చిందని, కళా ప్రాంగణంతో పాటు మినీ హాల్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు.

# తాటితూరు పాఠశాలలో జగనన్న కిట్లు పంపిణీ



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : భీమిలి మండలం,తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డొకర శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు, ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పి స్తుందని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా పనిచేస్తుందన్నారు. అదే విధంగా పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, సమకూర్చడం అభినందనీయమనీ అన్నారు. తాటితూరు గ్రామ సర్పంచ్ సిరిగుడి సంతోషి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి అధికారం చేపట్టిన తర్వాత ప్రతి సంవత్సరం విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ,బూట్లు, సాక్షులు,స్కూల్ బ్యాగులు, అందిం చటం అభినందనీయమనీ అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్ఆర్సిపి పార్టీ ప్రెసిడెంట్ కొయ్య రమేష్ మాట్లాడుతూ 2024 తాటితూరు పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులు దాటిన ప్రతి విద్యార్థికి వెయ్యి రూపాయలు బహుమతిగా అందజేస్తానని తెలిపారు. పాఠశాల చైర్మన్ సరగడ రవి మాట్లాడుతూ తాటితూరు లో జగనన్న విద్యా కానుక కిట్లతో ఒక పెద్ద పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టిఎస్.వి. ప్రసాదరావు, కె మురళీధర్, తార కేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, శేఖర్, ప్రభావతి, సునీత, కామేశ్వరి, గ్రామ పెద్దలు కొయ్య శ్రీనివాసరావు, గురునాయుడు, మేడ నాని, కొసాన పోలిరెడ్డి బోని కనక, ఉండబట్ల చిన్నారావు, కొయ్య రమేష్, బోయ అప్పల రామ్,తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మాట నిలబెట్టుకోవాలి !

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) అమలు చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అలాగే 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే క్రమబద్ధీకరించాలని నిర్ణయించడంతో ఇప్పుడు పని చేస్తున్న వేలాదిమంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లు గడిచాక ఇలా ప్రకటించడం దాని విశ్వసనీయతను దెబ్బతీసింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలోనూ అదే పరిస్థితి. మాట తప్పం.. మడమ తిప్పం.. అన్న ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం తగదు. ఎన్నికల హామీల మేరకు ఒపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని వర్తింపజేస్తేనే ఈ సర్కారు మాట నిలబెట్టుకున్నట్టు అవుతుంది. కనుక మంత్రివర్గ నిర్ణయాలను పున:సమీక్షించడం అవసరం. 'పెన్షన్ భిక్ష కాదు... అది ఉద్యోగి హక్కు' అన్న విషయం మరువరాదు. ఉద్యోగ విరమణ చేసేనాటికి పొందే మూలవేతనంలో 50 శాతం మొత్తాన్ని ఉద్యోగికి పెన్షన్‌గా చెల్లించేలా జిపిఎస్‌ను రూపొందించామనీ, ఇది దేశానికే ఆదర్శం అవుతుందని ప్రభుత్వ పెద్దలంటున్నారు. సిపిఎస్ లో మాదిరిగానే జిపిఎస్‌లో కూడా ఉద్యోగి జీతం నుండి పది శాతాన్ని రికవర్ చేస్తామంటూ ఇదే ఆదర్శమంటే ఎలా? కాకపోతే ఉద్యోగి రిటైర్‌మెంట్ నాటికి పొందే మూల వేతనంలో 50 శాతం పెన్షన్, దానిపై డియర్‌నెస్ రిలీఫ్ ఇస్తామన్న ప్రతిపాదన గతం కంటే కొంత మెరుగనిపిస్తుంది. కాని, జిపిఎస్ ఉద్యోగికి పూర్తి స్థాయి భద్రతను ఇవ్వదు. దానికి చట్టబద్ధత ఏమిటి? పిఎఫ్ఆర్‌డిఎ చట్ట పరిధిలోనే కొనసాగుతూ ఉద్యోగి ఇలాంటి గ్యారెంటీలను పొందే అవకాశం ఉంటుందా? కేంద్ర చట్టానికి, రాష్ట్ర చట్టానికి మధ్య ఏ అంశంలోనైనా వైరుధ్యం తలెత్తితే అమలయ్యేది కేంద్రం మాటే కదా! బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటి సిపిఎస్‌ను కేంద్రం వదులుకుంటుందా? వారిని నడిపిస్తున్న కార్పొరేట్లు తమ షేర్ మార్కెట్‌కు చేరుతున్న లక్షల కోట్ల రూపాయల ఉద్యోగుల సొమ్మును కాదంటాయా? నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రంలో మోడీ సర్కారు పెట్టే షరతులను తు.చ. తప్పక అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందా? కనుక ఏతావాతా పరిశీలిస్తే జిపిఎస్ అనేది సిపిఎస్‌ను మరో రూపంలో అమలు చేయడమేనన్న పరిశీలకుల మాట సత్య దూరం కాదు. రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంవల్ల సుమారు 10 వేల మంది లబ్ధి పొందుతారని సర్కారు పెద్దలు చెబుతున్నారు. కానీ ఆ కటాఫ్ తేదీ మూలంగా దాదాపు దాదాపు ఎనిమిది వేల మంది నష్టపోతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. రెండు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లు, సుమారు 800 మంది సిఆర్‌టిలు రెగ్యులర్ కాని పరిస్థితి ఏర్పడుతోంది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యధ వర్ణనాతీతం. వివిధ యూనివర్సిటీలు, ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న టైమ్‌స్కేల్, ఫుల్‌టైమ్, కంటింజెంట్, డైలీ వేజ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఐదేళ్లు కాంట్రాక్టు సర్వీస్ పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగి రెగ్యులర్ అయ్యేలా చర్యలు చేపట్టాలని, రెగ్యులరైజేషన్ లోగా రిటైర్ అవుతున్న ఉద్యోగులకు పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్న ఆయా సంఘాల డిమాండ్లు అత్యంత న్యాయ సమ్మతమైనవి. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం దాని బాధ్యత. ఏది ఏమైనప్పటికీ ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అందరి ఏకాభిప్రాయంతో ముందుకు పోవాలే తప్ప గతంలో మాదిరిగా నిర్బంధ మార్గం పట్టరాదు.

## బేగంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి స్వాగతం పలికిన సీఎం కేసీఆర్..



హైదరాబాద్, (విజయభాను న్యూస్) : బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డి కూడా స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీలు సంతోష్ కుమార్, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్‌తో పాటు పలువురు రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

ద్రౌపది ముర్ము విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకొని, రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రీవ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతారు. పరేడ్ అనంతరం తిరిగి ఢిల్లీకి వెళ్లిపోతారు.

## సభాపతిని కలిసిన రహదారుల భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్

### ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం సూచన



ఆముదాలవలస, : ఆముదాలవలస నియోజకవర్గం పరిధిలో రహదారులు, ప్రభుత్వ భవన నిర్మాణాల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం సూచించారు. అధునాతన వస్తు సామాగ్రి, టెక్నాలజీ వినియోగించడం ద్వారా రహదారుల నిర్మాణాలు, భవనాల నిర్మాణాలు ఎక్కువ కాలం మన్నికలో ఉండటం సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం రహదారుల భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐ వి ఎస్ జగన్నాథం శుక్రవారం సభాపతి ని గౌరవపూర్వ కంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ రహదారులు తో పాటు, వంతెనలు, భవనాలు నిర్మాణాల పనులు వేగ వంతం అయ్యేలా చూడాలని కోరారు. పనులపై పటిష్టమైన పర్యవేక్షణ ద్వారా నాణ్యత ప్రమాణాలు సాధ్యమన్నారు. తన నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న బలసల రేవు వారధి నిర్మాణం, శ్రీకాకుళం నుండి ఆముదాలవలస వరకు నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం, పురుషోత్తపురంలో గల సి హెచ్ సి భవనాలు తో పోటు, రహదారుల భవనాల శాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

రహదారులు నిర్మాణాలు.. జాతీయ రహదారులు నిర్మాణానికి ఏ మాత్రం తీసి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రోడ్డు నెట్వర్క్ విస్తరణలో ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. రోడ్ల విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాలను ముఖ్య పట్టణాలకు అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థ మెరుగవుతుందన్నారు.

ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమయ్యే చోట్ల పనులు గుర్తించడం, డి పి ఆర్ లు పూర్తి చేసుకుని అనుమతులు పొంది జరుగుతున్న రహదారుల పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలన్నారు.

## దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

టెక్కలి : సమాజంలో నిత్యం జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ప్రతిఒక్కరూ దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి అన్నారు. టెక్కలిలో దిశ యాప్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, ఇందిరాగాంధీ కూడలి తదితర ప్రాంతాల్లోని షాపింగ్ కాంప్లెక్స్, ఆటో స్టాండ్ వద్ద మహిళలతో, కళాశాలల విద్యార్థినులతో దిశ యాప్ నమోదు చేయించారు. ఈయనతో పాటు ఎస్ఐ ఎల్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

జి.సిగడాం : జి సిగడాంలో ఎస్ఐ చామంతుల రామారావు ఆధ్వర్యాన దిశ యాప్ డౌన్‌లోడ్‌పై గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వాహనదారులను నిలుపుదల చేసి మరీ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 మంది చేత దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించానని తెలిపారు. దిశ యాప్ మహిళలకు ఎంతో సురక్షిత, భద్రతను కలిగిస్తుందన్నారు. ఒక్కసారి ఎస్ఒఎస్‌పై నొక్కగానే కంట్రోల్ రూమ్‌కి సమాచారం వెళ్తుందని పేర్కొన్నారు. తక్షణమే బాధితుల దగ్గరికి పోలీసులు వచ్చే రక్షిస్తారని తెలిపారు.

## కవి సమయం

### ఇబ్బందే

ఉన్నత చదువులు చదివేము-ఫలితం అంతంతే...?
కొందరు వరకే ఫలితం ఇంతంతే...
కమ్మరి శాల్లో సమ్మెట్టేద్దామంటే... పనిలేదు
మోపులు మోస్తామంటే... చేతారపని కరువే...
'కబలం' రెండు పూటలు కలిమేది?
సవ్యంగ పాలన విధానం విధులేవి?
ఓటులు రాజ్యం వ్యాపారం
ఆకాశం తాకిన ధరలే...
చూద్దాం ఎన్నాళ్ళో - బతికి నన్నాళ్ళు...
మారేదంది- ముందుంది
ఆ... జనాలతో నడుస్తుంది
సుభిక్ష పాలన అంటుంది
మత్తుకు (నిసానీరు) అలవాటు - కొందరంటు
అనారోగ్యాలుతో వారంటు- మందులు మింగుట కర్మంటు
శాస్త్రవేత్తలు విజ్ఞాననం - ఎన్నెన్నో విధాలు
ప్రపంచానికే వెలుగులు - వారి మార్గాలు
దేవతలంత ఎప్పుడు భారత పుడిమిన అడుగులు పెడతారు
భారత భూమికి మోక్షం పడుతుందంటాము
అమ్మ, నాన్న మాటలు తగ్గి
మమ్మీ, డాడి మాటలు పెరిగి
మాట, మాట ఫలుకులకు
ఆంగ్ల పదాలే జోరంటు
ఇదేమి తంటా...
మన తెలుగుభాష పోతుంది మన యింట

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు


## పంచాంగం

| మాసం : జ్యేష్ఠ; తిథి : చతుర్ధశి ఉ.8.30; రోహిణి సా.4.11, వ.ఉ.7.55ల 9.34; వ.రా.10.04ల 11.45. | శనివారం 17-06 -2023 |
| --- | --- |

a **మేషం:** వైద్యులకు శస్త్రచికిత్సలలో ఏకాగ్రత మెళకువ చాలా అవసరం. ఉద్యోగస్తులు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. b **వృషభం :** మీ చుట్టు ప్రక్కల వారితో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. స్త్రీలకు దైవ, పుణ్యకార్యాల పట్ల ఆసక్తి పెరుగు తుంది. సిమెంటు, కలప, ఇటుక వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. C **మిథునం :** ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. సోదరి, సోదరులతో ఉల్లాసంగా గడుపు తారు. దైవ దర్శనాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యంతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. d **కర్కాటకం :** బ్యాంకుల్లో మీ పనులకు స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. ఇతరులకు వాహనం ఇవ్వటం వల్ల సమస్యలు తలెత్తుతాయి. అకాల భోజనం, విశ్రాంతి లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. స్థిరాస్తి విక్రయానికి ఆటంకాలు తొలగి పోగలవు. చెప్పుడు మాటలకు ప్రాధాన్యమివ్వటం మంచిది కాదని గ్రహించండి. e **సింహం :** సంఘంలో మీ మాటకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సినిమా, సంగీత, నృత్య కళాకారులకు సన్మానాలు వంటివి జరుగుతాయి. కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. స్త్రీలకు టి.వి కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలు అందుతాయి. f **కన్య :** మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. పాత వస్తువులను కొని సమస్యలు తెచ్చుకోకండి. స్త్రీలకు అయిన వారి ఆరోగ్యం కలవరపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో బిజిగా ఉంటారు. బ్యాంకు వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. g **తుల :** ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తినిస్తాయి. వ్యాపారాల అభివృద్ధికి బాగా శ్రమిస్తారు. స్త్రీలకు సంపా దన పట్ల ఆసక్తితో పాటు అవకాశాలు కలిసిరాగలవు. రుణం తీర్చి తాకట్టు వస్తువులను విడిపిస్తారు. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెంచు కుంటారు. h **వృశ్చికం :** నిరుద్యోగులు నిరుత్సాహం వీడి ఆత్మ విశ్వా సంతో యత్నాలు కొనసాగించటం మంచిది. పెద్దలను, ప్రముఖులను కలుసుకొని వారికి బహుమతులు అందజేస్తారు. i **ధనుస్సు :** ంవ్యాపారాల్లో పోటీని తట్టు కుంటారు. మీ కార్యక్రమాలలో స్వల్ప మార్పులుంటాయి. కాంట్రాక్టర్లకు ఏకాగ్రత లోపం వల్ల చికాకులు తప్పవు. j **మకరం :** స్త్రీలకు బంధు, మిత్రులతో మంచి గుర్తింపు రాణింపు లస్తుంది. కొబ్బరి పండ్లు, పూలు, చిరువ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. మీ అలవాట్లు బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. రాజకీయాల లోని వారికి సమస్యలు తలెత్తుతాయి .k **కుంభం :** వృత్తి ఉద్యోగాల్లో తలెత్తిన ఆటంకాలు తొలగిపోగలవు. దైవ సేవ, పుణ్యకార్యాల్లో పాల్గొంటారు. ఉపాధ్యాయిలకు సదవకాశాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకున్నంత సాఫీగా సాగవు. L **మీనం :** కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులు తప్పవు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. విదేశీ యానం కోసం చేసే యత్నాల్లో స్వల్ప చికాకులు ఎదుర్కొంటారు.

# సంకీర్తన

## కష్టాలు తీర్చు కాలాంజనేయుడు




ఆయా క్షేత్రాలలో .. వివిధ రూపాలలో పూజలు అందుకుంటూ ఉంటాడు. భక్తాంజనేయుడు .. దాసాంజనేయుడు .. యోగాంజనేయుడు .. ప్రసన్నాంజనేయుడుగా ఆయన భక్తులచే పూజాభి షేకాలు అందు కుంటూ ఉంటాడు. అలాంటి హనుమంతుడు 'కాలాంజనే యుడు'గా పూజలు అందుకునే ఆలయం హైదరాబాద్ - అత్తాపూర్ లోదర్శనమిస్తుంది. ప్రాచీనకాలం నాటి 'అనంత పద్మనాభస్వామి' ఆలయ ప్రాంగణంలో కాలాంజనేయస్వామి కొలువుదీరి కనిపిస్తుంటాడు. అక్కన్న - మాదన్నలు ఈ ఆలయాన్ని నిర్మించినట్టుగా చెబుతారు. ఇక్కడ హనుమంతుడు నల్లని రూపంలో దర్శనమిస్తూ ఉంటాడు గనుక, కాలాంజనేయస్వామిగా పిలుస్తుంటారు. స్వామివారికి సిందూరం కాకుండా సంపెంగ తైలం పూయడం ఇక్కడి ప్రత్యేకత. స్వామివారు ఇరువైపులా శంఖు చక్రాలు కలిగి ఉండటం విశేషం. ఇక్కడి స్వామి వారిని పూజించడం వలన .. అంకితభావంతో ఆయనని సేవించడం వలన కష్టాలు తొలగిపోతాయని భక్తులు చెబు తుంటారు. దోషాలు .. పాపాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు చేకూరతాయని విశ్వసిస్తుంటారు.

## శని ప్రభావాన్ని తొలగించే శివుడు

సాధారణంగా కొన్ని శైవ క్షేత్రాలలో రాహు .. కేతు సంబంధమైన పూజలు, శని ప్రభావాన్ని తొలగించే పూజలు జరుగుతుంటాయి. అలాంటి ప్రాచీనమైన క్షేత్రాలలో ఒకటిగా ఆదిలాబాద్ జిల్లాలోని 'సిరిచెల్మ' దర్శనమిస్తుంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడని స్థలపురాణం చెబుతోంది. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా తిరుగాడటం జరిగిందని చెబుతుంటారు.ఈ గ్రామస్తులంతా స్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించేవారట. అలాంటి గ్రామం ఒకసారి తీవ్రమైన కరువు బారినపడటం జరిగింది. ఎక్కడా నీళ్లు లేకపోవడంతో, గ్రామస్తులకు ఏం చేయాలో పాలుపోక ఆందోళన చెందసాగారు. అలాంటి పరిస్థితుల్లో స్వామివారు ఒక బాలుడి రూపంలో వచ్చి వాళ్లకి ధైర్యం చెప్పాడు. ఆ తరువాత తెల్లవారేసరికి స్వామి ఆ గ్రామంలో పెద్ద చెరువును తవ్వాడు. అప్పటి నుంచి ఆ చెరువు వాళ్ల జీవనాధారంలో ప్రధాన భాగమైంది.స్వామివారు ప్రత్యక్షంగా వచ్చి తమ కష్టాలను తీర్చాడు కనుక, అందుకు కృతజ్ఞతగా ఆ గ్రామ స్తులు ఆయనని అను నిత్యం సేవిస్తూ వస్తు న్నారు.

తమ గ్రామాన్ని సదారక్షి స్తున్నవాడు ఆ సదా శివుడేనని విశ్వసిస్తుం టారు. ఆయా పుణ్య తిథుల్లో ఆయనని మరింతగా సేవించి తరిస్తుంటారు. స్వామిని ఆరాధించడం వలన సమస్త పాపాలు .. దోషాలు నశిస్తాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు.



# రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు పై భహిరంగ సభ..

**- అరకులో జరిగే భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి..**

**- అరుకు నియోజకవర్గ కో కన్వీనర్ శెట్టిరాజు..**

అనంతగిరి, విజయభాను న్యూస్ : ఏ.ఎస్.ఆర్ జిల్లా అరకు నియోజకవర్గం అరకు నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాడు జరిగే నియోజకవర్గ ప్రధాన కూడలి వద్ద బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పూరందేశ్వరి, అరుకు పార్లమెంట్ కన్వీనర్ కొత్తపల్లి గీత నేతృత్వంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు రాంజీ రాజారావు, అరుకు నియోజకవర్గ కో కన్వీనర్ శెట్టి రాజు పాత్రికేయులకు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకులో నిర్వహించ నున్న భారీ బహిరంగ సభను పార్టీ కార్యకర్తలు నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



బహిరంగ సభ పిలుపు మేరకు ప్రధాని నరేంద్రమోడీ పాలన విజయాలు 9 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విదానాలను భారీ భహిరంగ సభ ద్వారా ప్రజలకు నేరుగా తెలియజేసేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి అలాగే పార్లమెంట్ కన్వీనర్లు పిలుపునిస్తున్న సంద ర్భంగా అభిమానులు, మేధావులు, యువకులు, మహిళా మణులు, బూత్ స్థాయినుండి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువమోర్చా ప్రధాన కార్యదర్శి సమరెడ్డి రామస్వామి,పాంగి నాగేశ్వరరావు,వంతల అప్పన్న, సిరగం రామకృష్ణ, సిరగం రాంప్రసాద్,అడ్డాల సోమరాజు పలువురు పాల్గొన్నారు.

# జనవిజ్ఞానవేదిక సభ్యత్వ పోష్టర్ ఆవిష్కరణ



రాజాం(విజయభాను న్యూస్) : రాజాం ప్రాంతీయ జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ పోస్టర్ ఆవిష్కరణ స్థానిక విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిధి గా విజయనగరం జిల్లా జనవిజ్ఞాన వేదిక ,ప్రధాన కార్యదర్శి పి. రమణ ప్రభాత్ విచ్చేసి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.

శాస్త్రీయ దృక్పథం తో అందరూ పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం అందరూ జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపును ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో..

జె.నీలయ్య, శాసపు సత్యన్నారాయణ, పెంకి గౌరిస్వరారావు, గిరడ చంద్ర శేఖర్, ఆర్నిపల్లి వెంకట రావు, కొత్త సాయి ప్రశాంత్, సిటు నాయకులు రామ్మూర్తి నాయుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, పందూరు వేణుగోపాల్, సంతకవిటి,రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర, జి. సిగడాం జేవీఈ సభ్యులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో అసంతృప్తి సహజం

**- కష్టించే వారందరికీ పదవులు వస్తాయి**

**- ఘనంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం**



కాకినాడ (విజయభాను న్యూస్) : కార్యకర్తల్లో కొందరికి అసంతృప్తి సహజమని వారు ఏమాత్రం నిరాశ చెందవద్దని కష్టించే ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్ర శేఖర్ రెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం కాకినాడలోని డి కన్వెన్షన్ హాలులో కాకినాడ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చైర్మన్గా పసుపులేటి వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్గా దోని చిట్టిబాబు సభ్యులుగా మాకిరెడ్డి పద్మావతి, గంధం, మంగాదేవి, పోతాప్రగడ వెంకట రవి కుమార్, మోస సూర్యకుమారి, పాలెపు రవికుమార్, మద్దాల సుగుణ మూర్తి, సింహాద్రి కృష్ణకుమారి, ఉంగరాల వెంకటేశ్వరరావు, శంక అనసూయ, కొట్టాల శివప్రసాదులతో మార్కెటింగ్ సూపర్వైజర్ వి యోజన దేవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాకినాడ నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని అయినా ఏదో మూలన కార్యకర్తలు, నాయకులలో అసంతృప్తి ఉందన్నారు. ఆయా డివిజన్లో ఉన్న నాయకులు తన వద్దకు వచ్చి ఇళ్ల పట్టాలు కావాలని అడుగుతున్నారని అది చేస్తే వారికి వ్యతిరేకత అవుతానని అందుకే తాను ఇంటి పట్టాలు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నట్లు చెప్పారు కార్యకర్తలు, నాయకుల చేయాల్సిన పనులను తన వద్దకు తీసుకురావాలని తాను ఆ పని చేసి వారికి తాను పరోక్షంగా మేలు చేస్తానని చెప్పారు. వ్యక్తిగతంగా, ఆర్థికపరమైన అవసరాలు ఉంటే తనను కలిస్తే వారికి తగు విదంగా న్యాయం చేస్తారని, ఈ విషయాన్ని మరెవరి దగ్గర కూడా చెప్పనని ద్వారంపూడి సభలో భరోసా కల్పించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ద్వారంపూడి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా వచ్చారు. దీనితో తీవ్ర నిరాశకు లోనయిన కార్యకర్తలు ద్వారం పూడి చేసిన ప్రసంగాన్ని విని ఉత్తేజు లయ్యారు. వైకాపా పార్టీలోనూ, ప్రభుత్వంలోని కష్టపడి పనిచేసిన కుటుంబాల వారి అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అలాగే త్వరలో అందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తానని 2024 ఎన్నికల్లో తిరిగి వైకాపా ప్రభుత్వాన్ని గెలిపించాలంటూ కోరారు. త్వరలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలు విని వాటి పరిష్కారానికి తగు సలహాలు సూచనలు చేస్తానని చెప్పారు. 2029 ఎన్నికలలో పని చేయడానికి టీం సభ్యులను ఏర్పాటు చేశామని వారందరూ కష్టపడి వైకాపా పార్టీని, జగన్ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఓ సర్వే సంస్థ కాకినాడ సిటీపై ప్రజల నుండి సర్వే చేపట్టిందని వాటిలో 54% అనుకూలంగా ఉందని చెప్పారు. టిడిపి, జనసేన రెండు కలిస్తే 62% ఓటింగ్ శాతం సాధిస్తుందని ఆ సర్వే చెప్పినట్టు చెప్పారు. కేవలం వైకాపా మిగిలిన ఆ పార్టీల మధ్య నాలుగు శాతం ఓట్ల లోపే సర్వే తేడా వచ్చిందని ఇది మనమంతా కలిసి ఉమ్మడిగా కష్టపడితే ఆ శాతాన్ని అధిగమించొచ్చని ద్వారంపూడి అన్నారు. కమిటీ పాలకవర్గం కష్టం చెప్పండి ద్వారంపూడి ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ వైకాపా అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైకాపా కాకినాడ జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత నాయకులు బెండ విష్ణుమూర్తి, అల్లు రాజబాబు, ఇనుకొండ పట్టాభి రామయ్య, రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాలు అందజేత

కురుపాం, విజయభాను న్యూస్ : పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలుగా పేరు పెట్టి వారికి నగదు పురస్కారాలు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఆణిముత్యాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితయ, తృతీయ స్థానాల విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఐదు మండలాలు ఎంఇఒలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# పరవాడలో జగనన్న ఆణిముత్యాలు

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హాజరు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం వెన్నలపాలెం ఏసీ కళ్యాణమండపం లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న అణిముత్యాలు కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ కి విద్యార్థులు స్వాగతం పలికి పులా మొక్క ను అందించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి,ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడం కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి ఆలోచనల నుండి వచ్చిందే ఈ 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమమని తెలిపారు. చదువులో ఎవరైతే చురుకుగా ఉంటారో వారిని మరింత ప్రోత్సహించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అన్నారు. నియోజక వర్గ స్థాయిలో టెన్త్, ఇంటర్ లో ప్రతిభ చూపిన విద్యార్థులను 'జగనన్న అణిముత్యాలు'గా గుర్తించి వారికి బహుమతులు అందచెయ్యడం జరుగుతుంది అని తెలిపారు.

విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో ప్రతిభ ను ప్రోత్సహించేందుకు ఈ వేడుకను నిర్వహిస్తున్నామని, సీఎంజగన్మోహనరెడ్డి నేడు భావితరనికి సంపదగా విద్యను, పిల్లలను ఎంచుకుని.వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహిం చాలన్నారు. అలాగే..మారుతున్న కాలానికి అనుగుణం గా విద్యార్థులు అప్డేట్ అవుతూ ఉండాలని.. టెక్నాలజీ ని ఉపయోగించు కుంటూ ఎదగా లన్నారు. అపుడే నేటి పోటీ యుగంలో విజేతలు గా నిలుస్తారని సూచిం చారు. భవిష్యత్తులో ప్రయోజ కులు కావాలని ఆకాంక్షించారు. అణి ముత్యాలు కార్యక్రమం విద్యా ర్థుల్లో పోటీ తత్వాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠ శాలల్లో సీట్లు దొరకడం లేదనే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం నియోజకవర్గంలో లో పదవతరగతి లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతి గా 10 వేలు, తృతీయ బహుమతి గా రూ.5 వేలు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు నాలుగు గ్రూపుల్లో నుండీ ప్రతిభ చూపిన విద్యార్థులుకు బహుమతులు ఒక్కొక్కరికీ రూ. 15 వేలు నగదు బహుమతిని అందజేశారు.

ఈ యొక్క కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, నాయుడు పాలెం సర్పంచ్ కుంద్రపు వరలక్ష్మి సీతారామయ్య, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, మండల జేసీ ఎస్ కన్వీ నర్ వెన్నెల సన్యాసిరావు, పరవాడ ఎం.పి.డి.ఓ హేమ సుందరరావు, ఆర్.సత్యనారాయణ, పరవాడ విద్యాశాఖ అధికారి సునీత, పెందుర్తి ఎంఈఓ పైడపు నాయుడు, ఎం ఎస్ ఎం ఎ డైరెక్టర్ నదియా, పిఎసిఎస్ చైర్మన్ బురద రాజు, కలపాక ఎంపీటీసీ సప్ప ప్రభ సన్యాసిరావు, తిక్కవాన్నిపాలెం సర్పంచ్ చేపల మసేను,మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్ చల్ల కనకరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పల నాయుడు, వై.సి.పి నాయకులు కుంద్రపు తాతజి,బొద్దపు చిన్నారవు, బండారు శ్రీను,బండారు కృష్ణ బాబు,బండారు శ్రీను, పల్లా గోవింద్, వెన్నెల సింహాద్రి, నందవరపు శ్రీను, సత్యనారాయణ, భాస్కర్,బుజ్జి, హై స్కూల్ హెడ్మాస్టర్లో లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించండి'

### అనే నినాదంతో యానాం పురవీధుల్లో ర్యాలీ



యానాం, విజయభాను న్యూస్ : స్థానిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు చెందిన 200 మంది విద్యార్థినీ విద్యార్థులు, టీచర్లు 'ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించండి' అనే నినాదంతో యానాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదు పాయాలతో పాటు అత్యుత్తమ విద్య, ఉదయం అల్పా హారంగా పాలు, మధ్యాహ్న భోజనం, యూని ఫామ్ లు, సైకిళ్ళు, పుస్తకాలు ఉచితంగా సమకూరు స్తున్నప్పుడు తల్లిదండ్రులు ఏమాత్రం ఖర్చు లేకుండా వారి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని విజ్ఞప్తి కరపత్రాలు పంచారు. ప్రదానోపాధ్యాయురాలు వి.నాగ నళిని కుమారి మాట్లాడుతూ...

రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఈ ఏడాది నుండి పి.ఎమ్ శ్రీ పథకంలో భాగంగా మరింత ఆధునిక వసతులు సమకూర్చుకుని విద్యార్థినీ, విద్యార్థులను అన్నివిధాలుగా తీర్చిదిద్ద బోతుందని తెలిపారు.

# తూర్పుకాపులను బీసీ-ఏ లో చేర్చాలి



రాజాం (విజయభాను న్యూస్) :రాష్ట్రంలోని తూర్పు కాపులను బీసి - ఏ లో చేర్చాలని రాజాం తూర్పుకాపు సంఘ అధ్యక్షులు శాసపు రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం రాజాం - జి ఎమ్ ఆర్ కేర్ రోడ్డులో రాజాం తూర్పుకాపు సంఘ కార్యాలయం నూత నంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ల్లో తూర్పుకాపులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ తరుణంలో బీసీ ఏ లో చేర్చి, తగు న్యాయం చెయ్యాలని కోరారు. సంఘ పెద్దలు సాకేటి సత్యన్నారాయణ, టంకాల కన్నం నాయుడు, కిమిడి విశ్వేశ్వరరావు, జి టి నాయుడు తదితరులు మాట్లాడుతూ రాజాం ప్రాంతంలోని తూర్పుకాపుల సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యాలయం ఎంతో ఉపయోగపడు తుందని, ప్రతీ తూర్పుకాపు బిడ్డ, ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో కెంబూరు రామకుమార్,పెంకి గౌరీశ్వరరావు, పిల్లా సత్యం నాయుడు, పొట్నూరు సోమశేఖర్, బెజ్జిపురపు బలరాం, కోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# అత్తయ్య వాళ్లింటికి షిఫ్ట్ అవుతున్నాం - ఉపాసన



పూర్తి భిన్నం. ప్రస్తుతం చరణ్ నేనూ.. అత్తమామలతో కాకుండా విడిగా ఉంటున్నాం. బేబీ పుట్టిన తర్వాత మేము అత్తమామల (చిరంజీవి-సురేఖ) తోనే ఉండాలని నిర్ణయించు కున్నాం. ఎందుకంటే, మా (చరణ్, ఉపాసన) ఎదుగుదలలో గ్రాండ్ పేరెంట్స్ కీలకపాత్ర పోషించారు. వాళ్ల నుంచి మేము ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నాం. గ్రాండ్ పేరెంట్స్‌తో ఉంటే

'రామ్‌చరణ్ నేనూ త్వరలోనే అత్తమామల దగ్గరకు షిఫ్ట్ అవుతున్నాం' అని ఉపాసన తెలిపారు. పుట్టబోయే బిడ్డ సంరక్షణను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆమె చెప్పారు. తమ వివాహ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తాజాగా ఓ ఆంగ్ల పత్రికతో ముచ్చటించిన ఆమె ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."సాధారణంగా ఎవరైనా దంపతులు పిల్లలు పుట్టిన తర్వాత వేరు కాపురం పెడుతుంటారు. కానీ, మేము దానికి వచ్చే ఆనందాన్ని మేము మా బిడ్డకు దూరం చేయాలనుకోవడం లేదు" అని ఉపాసన చెప్పారు. అనంతరం, ప్రెగ్నెన్సీ గురించి చరణ్‌కు చెప్పినప్పుడు ఆయన ఎలా రియాక్ట్ అయ్యారో చెబుతూ..

"ప్రెగ్నెంట్ అయ్యానేమోనని సందేహంగా ఉందంటూ మొదటిసారి చరణ్‌కు చెప్పాను. కన్ఫార్మ్ అయ్యాక ఆయన ఎంతో సంతోషించారు. తన స్టైల్‌లో సెలబ్రేట్ చేశారు" అని ఆమె తెలిపారు.

# రాకీ రాణీల.. ప్రణయ యాత్ర




బాలీవుడ్ కథానాయకుడు రణవీర్ సింగ్, అలియా భట్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ'. కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో ఇది ఒకటి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం ఈ నెల 20న విడుదల చేయనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. తదుపరి ఈ సినిమా ట్రైలర్‌ను జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ధర్మేంద్ర, జయా బచ్చన్, షబానా అజ్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. రాకీ, రాణీల మధ్య ప్రేమకథను ఈ సినిమాలో చూపించున్నారు. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జూలై 28న ఈ సినిమా విడుదల కానుంది.

# సాయితేజ్ చిత్రంలో నాయికగా..



ఈ వేసవిలో 'విరూపాక్ష'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు సాయితేజ్. ఇప్పుడు పవన్ కల్యాణ్‌తో కలిసి 'బ్రో' సినిమాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇది వచ్చే నెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని తర్వాత సాయితేజ్ కొత్త దర్శకుడు జయంత్‌తో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. కొత్తదనం నిండిన ప్రేమకథతో రూపొందనున్న ఈ సినిమాని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. కాగా, ఇందులో తేజుకు జోడీగా సాక్షి వైద్యను ఖరారు చేశారని సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. స్క్రిప్ట్ నచ్చడంతో సినిమా చేసేందుకు సాక్షి సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలిసింది. 'ఏజెంట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ప్రస్తుతం వరుణ్ తేజ్‌తో కలిసి 'గాండీవధారి అర్జున'లో నటిస్తోంది. దీన్నీ బీవీఎస్ఎన్ ప్రసాదే నిర్మిస్తున్నారు.

# ధైర్యం కోసం ప్రార్థించాను - సమంత



'వ్యాధి నిర్ధారణ జరిగి ఒక సంవత్సరం అయింది. ఈ ఏడాదిని ఎంతో బలవంతంగా ముగించాను. నా శరీరంతో ఎన్నో పోరాటాలు చేశాను. ఉప్పు, పంచదార లేని ఫుడ్ తిన్నాను. ఎంతో మత్తుతో కూడిన మందులు వేసుకున్నాను. ఎప్పటికప్పుడు బలవంతంగా జీవితాన్ని రీస్టార్ట్ చేస్తూనే వచ్చాను. నన్ను నేను చూసుకొని, ఆత్మ పరిశీలన చేసుకున్న ఏడాది ఇది. కెరీర్‌పరంగా కూడా ఎన్నో పరాజయాలు చవిచూశాను. వీటి కోసం ఎన్నో ప్రార్థనలు, పూజలు చేశాను. నాకు ధైర్యాన్ని, బలాన్ని, మనశ్శాంతిని ఇవ్వమని ప్రార్థించాను. అన్ని వేళలా కాలం నీది కాదు అని నేర్పిన ఏడాది ఇది. ముఖ్యంగా.. నేను కంట్రోల్ చేయాల్సినవి మాత్రమే కంట్రోల్ చేయాలి.. మిగిలినవి వదిలేయాలి. ఒక్కోసారి రిస్క్ అయినా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ ఉండాలి. అయితే ఆ అడుగు కొన్నిసార్లు విజ యం అందుకోవడం కోసం కాదు.. ముందుకు సాగడానికి మాత్రమే. అలా ముందుకు సాగడం కూడా ఒక విజయమే అని ఈ ఏడాది నాకు నేర్పింది. కొన్ని విషయాల గురించి ఆలోచించు కుంటూ కూర్చోకూడదు. నా ప్రేమను, నన్ను ఇష్టపడేవారిని వెతకాలి. నన్ను ప్రభావితం చేసే శక్తిని ద్వేషించకూడదు' అంటూ సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

# జులై 14న 'బేబీ'



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న 'బేబీ' చిత్ర విడుదల తేదీ ఖరారైంది. విరాజ్ అశ్విన్ కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తై.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. సాయి రాజేష్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాని ఎస్కేఎన్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు మేకర్స్. వచ్చే నెలలో అంటే జులై 14న ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.

# అమితాబ్‌తో ప్రయాణం... ప్రత్యేకం



దయానా పెంటీ, అమితాబ్ బచ్చన్

ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సెక్షన్ 84'. రిభు దాస్‌గుప్తా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కోర్టురూమ్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. డయానా పెంటీ, నిమ్రత్ కౌర్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకున్నట్లు ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది డయానా. 'ఈ ప్రయాణం నాకు ప్రత్యేకమైనది. ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించడానికి ముందు అమితాబ్‌తో కలిసి నటింబోతున్నానని చాలా ఉత్సాహంగా ఉన్నాను. అదే సమయంలో భయంగా కూడా అనిపించేది. కానీ, ఇప్పుడు ఆయనతో కలిసి ఒక సినిమా పూర్తి చేశానని గర్వంగా చెప్పుకుంటాను. ఈ సినిమాలో ఆయనతో కలిసి నటించడానికి ఎంతో స్వేచ్ఛను ఇచ్చారు. ఇలాంటి గొప్ప వ్యక్తిని చూస్తూ.. ఆయనతో నటించడం నా జీవితంలో మర్చిపోలేని గొప్ప అనుభూతి. నాకు ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని అందించిన రిభుదాస్ గుప్తాకు ధన్యవాదాలు' అని వ్యాఖ్యల్ని జోడించింది డయానా.



# కోహ్లికి అవకాశం లేకుండా చేశారు - సల్మాన్ భట్

విరాట్ కోహ్లీనే కెప్టెన్సీని వదిలేశాడు.. లేదు అతడిని సాగనంపారు అనే వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. తాజాగా పాక్ మాజీ కెప్టెన్ కూడా విరాట్‌కు మద్దతుగా మాట్లాడాడు. టీమ్‌ఇండియా కెప్టెన్సీ నుంచి విరాట్ కోహ్లీ దిగిపోవడంపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం తెలిసిందే. అప్పటి బీసీసీఐ అధినాయకత్వంపై విభేదాలతోనే టెస్టు కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. అతడిని ఎవరూ తప్పించలేదని, తనకు తాను సారథ్య బాధ్యతలను వదిలేసినట్లు కామెంట్లు వచ్చాయి. వీటిపై పాక్ మాజీ కెప్టెన్ సల్మాన్ భట్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ - బీసీసీఐ మధ్య క్రమంగా దూరం పెరగడంతో.. మరో మార్గం లేకనే కోహ్లీ ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. మేనేజ్‌మెంట్, ఆటగాడి మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం వల్లే సమస్య తలెత్తినట్లు అనిపించిందని తెలిపాడు."కోహ్లీ విజయవంతమైన కెప్టెన్. అయితే, అతడిని ఒక్కో ఫార్మాట్ నుంచి తప్పించిన విధానం చర్చనీయాంశమైంది. విరాట్ కోహ్లీనే కెప్టెన్సీని వదిలేశాడు.. ఎవరూ అతడిని తీసేయలేదని చాలా కామెంట్లు చదివా. అయితే, విరాట్ అలా చేయడానికి బోర్డే పరిస్థితులను సృష్టించింది. వన్డే కెప్టెన్సీ నుంచి తప్పిస్తున్నట్లు మేనేజ్‌మెంట్ తనతో సంప్రదింపులు జరపలేదని కోహ్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడలేదా..? మీరంతా ఆ వీడియోను మరోసారి చూడండి. టెస్టు కెప్టెన్సీ నుంచి కోహ్లీ నిష్క్రమణ జరగకుండా ఉంటే బాగుండేది. ప్రొఫెషనల్ ఆటగాడైన విరాట్ కెప్టెన్‌గా జట్టుకు అద్భుత విజయాలను అందించాడు" అని సల్మాన్ భట్ చెప్పాడు.

విరాట్ కోహ్లీ తర్వాత మూడు ఫార్మాట్ల కెప్టెన్సీని రోహిత్ శర్మ అందుకున్న విషయం తెలిసిందే. గత పదేళ్లుగా ఐసీసీ కప్‌ను గెలవలేకపోయిన భారత్‌కు రోహిత్ అందిస్తాడేమోనని ఆశలు అభిమానుల్లో కలిగాయి. గతేడాది జరిగిన ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ పోటీల్లో నిరాశపరిచాడు. తాజాగా డబ్ల్యూటీసీ ఫైనల్‌లోనూ భారత్ ఓడిపోయింది. మరోవైపు వ్యక్తిగతంగానూ రోహిత్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఈ ఏడాదే మళ్లీ ఆసియా కప్, వన్డే ప్రపంచకప్ వంటి టోర్నీలు జరగబోతున్నాయి. ఈసారైనా ఐసీసీ కప్ లోటును తీరుస్తాడేమో చూడాలి.

# 1920 ట్రైలర్ టెర్రిఫిక్ గా వుంది : కింగ్ అక్కినేని నాగార్జున



లెజెండరీ ఫిల్మ్ మేకర్ మహేష్ భట్ సమర్పణలో ఆయన స్వీయ రచనలో రూపొందిన హారర్ మూవీ "1920: హార్రర్స్ ఆఫ్ ది హార్ట్". అవికా గోర్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రానికి కృష్ణ భట్ దర్శకత్వం వహించారు. విక్రమ్ భట్ ప్రొడక్షన్ పై రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్ డా. రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించారు. జూన్ 23న ఈ చిత్రం తెలుగు విడుదల కానున్న నేపథ్యంలో కింగ్ అక్కినేని నాగార్జున ముఖ్య అతిధిగా ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. మహేష్ భట్ గారిని కలిసి దాదాపు ఇరవై ఏళ్ళయింది. కానీ ఆయన నా మనసులో ఎప్పుడూ ఉంటారు. నేను కూడా ఆయన మనసులో ఉంటాననే నమ్ముతున్నాను. ముంబై షూటింగ్స్ కి వెళితే భట్ గురించి అడుగుతుంటాను. బ్రహ్మాస్త్ర సినిమాలో అలియా భట్ తో వర్క్ చేశాను. ఆ సమయంలో భట్ గురించి ఎన్నో విషయాలు మాట్లాడుకోవడం జరిగింది. భట్ నాకు గురు. చాలా స్ఫూర్తిని ఇచ్చే వ్యక్తి. ఎంతో మందికి అవకాశాలు ఇచ్చి దారి చూపించారు. ఆయన పాటలు చేయించుకునే విధానం అద్భుతంగా వుంటుంది. ఇప్పటికీ 'తెలుసా మనసా పాట చేయించిన విధానం గుర్తుకు వస్తుంటుంది. అలాగే 'జకమ్' లో గలీ మే ఆజ్ చాంద్ నిక్లా పాట నా ఆల్ టైమ్ ఫేవరెట్. ఆ జ్ఞాపకాలన్నీ గుర్తుకు వస్తున్నాయి. 1920 ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది. ట్రైలర్ చూస్తున్నపుడు ఒక నిశ్శబ్దం వచ్చింది. నిజంగా భయపడ్డాను. అందుకే దాన్ని పోగొట్టుకోవడానికి నవ్వాను(నవ్వుతూ). ఇలాంటి సినిమాని పెద్ద స్క్రీన్ లోనే చూడాలి. వెయ్యికి పైగా స్క్రీన్స్ లో సినిమా విడుదలవుతుంది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. నాకు హారర్ సినిమాలు చూడాలంటే భయం. కానీ ఈ సినిమా చూడాలనిపిస్తుంది. చూడాలనిపించేలా చేశారు. హారర్ సినిమాలు చూసినప్పుడు ఆ కిక్కే వేరు. కృష్ణ అద్భుతంగా తీసింది. అవికా గోర్ డిఫరెంట్ పాత్రలు చేస్తుంది. ఈ సినిమా తన కెరీర్ లో పెద్ద హిట్ కావాలి. జూన్ 23న ఈ సినిమా వస్తోంది. రేపు ఒక పెద్ద సినిమా ప్రభాస్ ఆదిపురుష్ వస్తుంది. ప్రభాస్ అండ్ టీంకి ఆల్ ది బెస్ట్. సినిమా అందరినీ మళ్ళీ థియేటర్ లోకి తీసుకురావాలి"అన్నారు.

కృష్ణ భట్ మాట్లాడుతూ.. : 1920 నా మనసు నుంచి వచ్చిన చిత్రం. ఇదొక ఎమోషనల్ స్టోరీ. హారర్ లో ఎమోషన్ ప్రయత్నించడం ఇదే తొలిసారి. ఖచ్చితంగా ఇది అందరికీ నచ్చుతుందనే నమ్మకం వుంది" అన్నారు. సంజయ్, దిలీప్ సోనీ తదితరులు ఈ ఈవెంట్ లో పాల్గొన్నారు.

## పుజారా స్థానంలో యశస్వి

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పరాజయంతో తీవ్ర నిరాశకు గురైన టీమ్‌ఇండియా త్వరలో వెస్టిండీస్ పర్యటనకు బయల్దేరనుంది. పర్యటనలో భారత్ రెండు టెస్టులు, మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. జులై 12న డొమినికాలో టెస్టు మ్యాచ్‌తో కరీబియన్ గడ్డపై టీమ్‌ఇండియా పోరు మొదలవుతుంది. అయితే ఇప్పుడు జట్టు ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరం. డబ్ల్యూటీసీ ఫైనల్లో ఓటమి నేపథ్యంలో టెస్టు జట్టులో మార్పులు తథ్యమని భావిస్తున్నారు. ముఖ్యంగా పుజారా ఉద్వాసన ముప్పును ఎదుర్కొంటున్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో సహా ఈ ఏడాది అతడు పెద్దగా రాణించలేకపోవడమే అందుకు కారణం. పుజారా స్థానంలో.. ఐపీఎల్‌లో పరుగుల వరదపారించిన రాజస్థాన్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు టెస్టు జట్టులో స్థానం దక్కొచ్చని తెలుస్తోంది. 21 ఏళ్ల జైస్వాల్ స్టాండ్‌బైగా డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఇంగ్లాండ్ వెళ్లిన సంగతి తెలిసిందే.



# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలి

**నిరాశ్రయులను గుర్తించి ఓటరుగా అవకాశం కల్పించాలి.**

**-జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా**



విశాఖపట్నం ,(విజయభాను న్యూస్) : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందిగా జాబితా రుపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓటరు జాబితా రూపకల్పన, చేరికలు , తొలగింపు, ఎన్నికల జాబితా స్వచ్ఛీకరణ, యువ ఓటర్ల నమోదు, జెండర్ రేషియో , ఈపి రేషియో, ట్రాన్సజెండర్స్ , నిరాశ్రయ ప్రజలను ఓటర్లుగా నమోదు , ఎన్నికల ఫిర్యాదులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందిగా జాబితా రుపొందించుటకు ప్రణాళిక చేయాలని అధికారులను ఆదేశించారు. క్లెయిమ్స్ , అభ్యంతరాలు ఉంటె వెబ్సైటు లో ప్రదర్శన చేయాలని పేర్కొన్నారు. ప్రతి సోమవారం రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు ఉంటె తీసుకోవాలన్నారు. ఓటర్ల పూర్తి జాబితా పబ్లికేషన్ చేసేముందు సంబంధిత బీఎల్వోలు వ్యక్తిగతంగా పరిశీలించి పోలింగ్ స్టేషన్ లో ప్రదర్శించాలని తెలిపారు. ఒకటికి మించి ఓటర్లుగా నమోదు కాబడి ఉంటె తనిఖీ చేసి, ఫారం 7 ద్వారా ఒక చోట మాత్రమే ఉండేటట్లు చూడాలన్నారు. ఒక ఇంటిలో 10 మందికి మించి ఓటర్లు ఉంటె అటువంటి జాబితాల్ని పరిశీలించాలని చెప్పారు. అదేవిదంగా 100 సంవత్సరాలు దాటి వయస్సు కలిగిన ఓటర్లు జాబితా స్వయం గా చూడాలని కలెక్టర్లను ఆదేశిం చారు. నిరాశ్రయులు , ట్రాన్సజెండర్స్ ను ఓటర్లు గా నమోదు చేయుటకు అవగాహన కల్పిం చాలని అన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజక వర్గం వారిగా ప్రత్యేక కార్యక్రమాలు రుపొందించి అమలు చేయాలని సూచించారు. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ జిల్లా వ్యా ప్తంగా స్వీప్ కార్యక్రమాల ను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున జిల్లాలో ఓటరు జాబితా రూపకల్పన, చేరికలు , తొలగింపు, ఎన్నికల జాబితా స్వచ్ఛీకరణ, యువ ఓటర్ల నమోదు , జెండర్ రేషియో , ఈపి రేషియో, ట్రాన్సజెండర్స్ , నిరాశ్రయ ప్రజలను ఓటర్లుగా నమోదు , ఎన్నికల ఫిర్యాదులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా సీఈవోకు వివరించారు. కొత్త ఓటర్ల నమోదు పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛమైన ఎన్నికల జాబితా రూపకల్పనకు ఎన్నికల కమిషన్ సూచనలు , సలహాలు ఎప్పటికప్పుడు పాటిస్తూ, అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున, జివీఎంసి కమీషనర్ సాయి కాంత్ వర్మ, డిఆర్వో శ్రీనివాసమూర్తి , ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్ , భాస్కర్ రెడ్డి , తహశీల్దార్లు, ఎలక్షన్ సెల్ సిబ్బంది , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# యోగ తత్వాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలి

**- ఏయూలో ఘనంగా ప్రారంభమైన రెండు రోజుల యోగా సదస్సు**



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** యోగా తత్వాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా యోగా కాన్షియస్‌నెస్ ఫర్ యూనివర్సల్ వెల్‌నెస్ అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం సదస్సునుద్దేశించి మాట్లాడుతూ ప్రపంచానికి యోగ సంపదను అందించిన ఘనత భారత దేశానిదేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వందలాది దేశాలు యోగాను ఆచరిస్తూ, ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నాయన్నారు. శరీరం, మనస్సు, మేధస్సు సక్రమంగా వినియోగిస్తే విజయం సాధించడం సులభమవుతుందన్నారు. అంతర్గతంగా మనం ఎవరు అని తెలుసుకోవడానికి యోగ ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. యోగ విధానాలను సాధన చేయడం వలన అత్మర్ముఖంగా మన గురించి మనం తెలుసుకోవగలమన్నారు. సంతోషం మనలోనే ఉంటుందన్నారు. యోగ సంస్కృతిని ఉత్తరాంధ్రలో వ్యాప్తిచేస్తామన్నారు. దీనిలో భాగంగా రానున్న కాలంలో ఏయూకు అనుబంధంగా పనిచేసే వంద కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం యోగా కేంద్రాలను ప్రారంభించే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఏయూకు అనుబంధంగా పనిచేసే ఉపకేంద్రాలను మరింత బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు మాట్లాడుతూ మనల్ని సంస్కరించే ప్రక్రియగా యోగా నిలుస్తుందన్నారు. మనకి మార్గనిర్ధేశకులుగా గురువులు నిలుస్తారన్నారు. రుషులు ఆచరించిన యోగ ప్రక్రియలు నేడు అందరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. రోగ రహిత జీవనం గడపడానికి యోగా ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్ భానుకుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగ ఒక భాగం కావాలన్నారు. వసుదైక కుటుంబకం అనే భావనతో యోగా వ్యాప్తి చేయడం జరుగుతోందన్నారు. నిష్ణాతులైన యోగ సాధకుల ప్రసంగాలు సదస్సులో ఏర్పాటు చేసామన్నారు. యోగా కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు మాట్లాడుతూ సదస్సులో బ్లెండెడ్ విధానంలో నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో నిష్ణాతులైన యోగ సాధనకులు, నిపుణులు 16 మంది విశిష్ట ప్రసంగాలు అందిస్తారన్నారు. సదస్సుకు 490 మంది రిజిస్ట్రర్ చేసుకున్నారన్నారు.

అనంతరం రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి స్వసంవేదానంద స్వామి యోగ చైతన్యంపై, సిద్ధయోగి డాక్టర్ అంతర్ముఖానంద అంతర్ముఖ ప్రాణాయామం అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆచార్య చిట్టూరి శ్రావణి, కృష్ణయ్య, గురునాథ్, డాక్టర్ తులసి రావు, విభాగ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం-విజయవాడ మధ్య పలు రైళ్లు రద్దు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లోని తాడి- అనకాపల్లి స్టేషన్ల మధ్య ఈనెల 14న గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. దీంతో విశాఖపట్నం-విజయవాడ మధ్య తిరిగే పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భద్రతా పనుల దృష్ట్యా రైల్వే అధికారులు ఈ మార్గంలో పలు రైళ్లను రద్దు చేశారు.

ఈనెల 17వ తేదీన గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 18న విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), 17న విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), 17న విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), 17న మచిలీపట్నం-విశాఖపట్నం (17219), 18న విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220) రద్దు చేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## జివిఎంసి కమిషనర్ ను కలిసిన జెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మను శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ ఆఫ్ మినిస్ట్రియల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఉద్యోగుల సమస్యలను లిఖితపూర్వకంగా కమిషనర్ కు అందించారు. ముఖ్యంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీయల్ సర్వీస్ రూల్స్ జీవో నెంబర్ 40 ఉద్యోగులందరికీ ప్రతి బంధంగా ఉన్నందున దానిని సవరణ కోరుతూ ప్రభుత్వాల నుండి నివేదికను తెప్పించేందుకు కృషి చేయాలని, జివిఎంసిలో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు పునర్ధరణ చేయాలని, జోనల్ వారీగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టులను భర్తీ చేసేందుకు చొరవ తీసుకోవాలని, అలాగే రెవిన్యూ టాక్స్ అసెస్మెంట్ సంఖ్యాపరంగా అవసరాన్ని బట్టి రెవిన్యూ అధికారి హోదాలో పదోన్నతికి కల్పించేందుకు చర్య తీసుకోవాలని, చాలా కాలంగా ఖాళీగా ఉన్న టైపిస్టు, స్టెనో టైపిస్టు హోదాలను జూనియర్ సీనియర్ అసిస్టెంట్ హోదాలకు బదిలీ చేసినట్లయితే మినిస్ట్రియల్ పోస్టులు పెరుగుతాయని, జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులకు మరుగుదొడ్లకు ఇబ్బంది ఉందని అందుకు మరుగుదొడ్లను ఆధునికరించాలని, ప్రస్తుతం ఉన్న పదోన్నతి ఫైల్స్ ను నిబంధనకు లోబడి ఆమోదించాలని, ఖాళీగా ఉన్న మినిస్ట్రీయల్ పోస్టులలో రోస్టర్ అనుసరించి నాలుగో తరగతి ఉద్యోగులతో భర్తీ చేయాలని, జెమ్స్ అసోసియేషన్ భవనంనకు కంప్యూటర్ ఫర్నిచర్ ఏర్పాటుతోపాటు మూతబడిన జివిఎంసి క్యాంటీన్ పునర్దించాలని జెమ్స్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, సభ్యులు ఎ.అప్పలనాయుడు, వి.సన్యాసిరావులతో పాటు ఇతర సభ్యులు కమిషనర్ కు వినతిపూర్వకంగా అందించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ జెమ్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నార్త్ ఈస్ట్రన్ వర్సిటీ బృందం గీతం సందర్శన


## సంయుక్త అద్యయనాలపై చర్చలు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** దాదాపు 100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన అమెరికాలోని బోస్టన్ లో గల నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో సంయుక్త అధ్యయనాలు జరపడానికి, బోధన, పరిశోధనలలో పరస్పర సహకారానికి ఆసక్తిని కనబరిచింది. ఈ మేరకు శుక్రవారం గీతంను సందర్శించిన నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ బృందంతో గీతం అకడమిక్ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి కమాండర్ గురుమూర్తి గంగాధరన్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సమావేశం అయ్యారు. నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ కె.సాగర్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ సీనియర్ డైరెక్టర్ మరియమ్మ థామస్ మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో గీతం విద్యార్థులు బోస్టన్‌లోని తమ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు పొంది బోధన, పరిశోధనలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం గీతంతో సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునేందుకు దారితీసిందన్నారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య రానున్న రోజులలో బలమైన అకడమిక్ సంబంధాలు నెలకొనగలవన్న ఆశా భావం వ్యక్తం చేశారు.

గీతం అకడమిక్ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు, కార్పోరేట్ సంస్థలతో బాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విషయ పరిజ్ఞానం అందించాలన్నది తమ లక్ష్యం అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో భారత ప్రభుత్వ నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఉన్నత విద్యను గీతం ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.


# బిపోర్‌జాయ్ ఎఫెక్ట్... 940 గ్రామాలకు విద్యుత్ కట్




న్యూఢిల్లీ : బిపోర్‌జాయ్ తుఫాను గురువారం అర్ధరాత్రి తర్వాత గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో తీరాన్ని దాటింది. తుఫాను క్రమంగా బలహీనపడి గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల మీదుగా మధ్యాహ్న సమయంలో తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండి) అంచనావేసింది. రాజస్తాన్ మీదుగా శుక్రవారం సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపింది. దీంతో రాజస్తాన్‌లో జూన్ 16, 17 తేదీల్లో భారీ వర్షాలు కురవవచ్చుని ఐఎండి డైరెక్టర్ మృత్యుంజరు మహాపాత్ర తెలిపారు. దీంతో బర్మేర్ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ముంబయిలోనూ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తుఫాను తీరాన్ని దాటే సమయంలో గుజరాత్ చిగురుటాకులా వణికింది. గంటకు 140 కి.మీల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయడంతో రాష్ట్రంలో 544 చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సుమారు 940 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. ఇద్దరు మరణించగా, సుమారు 22 మంది గాయపడినట్లు తెలిపారు. తుఫాను ప్రభావంతో కచ్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. మాండ్విలోని పలు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు 94,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. తుఫాను ప్రభావం రైళ్ల రాకపోకలపై పడింది. సుమారు 99 రైళ్లను రద్దు చేయవచ్చని, లేదా ఆలస్యంగా నడుస్తాయని పశ్చిమ రైల్వే తెలిపింది. గుజరాత్‌లోని జామ్ నగర్ విమానాశ్రయంలో కార్యకలాపాలు నిలిపివేశారు.

వరద పరిస్థితుల దృష్ట్యా ప్రధాని మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్లో మాట్లాడారు. తుపాను పరిస్థితుల గురించి ఆరా తీశారు. గిర్ అడవుల్లో వణ్యప్రాణుల భద్రత వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం.. రూ.కోట్లలో నష్టం..



తిరుపతి (క్రైమ్), **(విజయభాను న్యూస్) :** తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గోవిందరాజస్వామి ఆలయం సమీపంలోని లావణ్య ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరగడం.. మంటలు ఇళ్ల వైపు వ్యాపిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గోవిందరాజస్వామి ఆలయ రథం వైపు మంటలు వస్తుండటంతో అగ్నిమాపక సిబ్బంది ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఐదంతస్తుల భవనంలోని ఓ ఫ్లోర్‌లో ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణం నిర్వహిస్తున్నారు.

అందులో విద్యుదా ఘాతంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో రూ.కోట్ల విలువైన ఫొటోలు దగ్ధమయ్యాయి. మూడు అగ్నిమాపక వాహనాల్లో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు భవనం ముందు ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. మంటలు చెలరేగడంతో ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. భవనంలో ముగ్గురు వ్యక్తులు చిక్కుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com